చిన్న కథ

# అమ్మా-నాన్న

– పెయ్యేటి రంగారావు



నాన్నంటే నాకు చాలా ఇష్టం. కటిక చీకటిలో, అడవి దారిలో నా చేయి పట్టుకుని వెలుగు రేకల వైపు నిబ్బరంగా నడిపించుకు పోయిన దేవుడు మా నాన్న.

నాకు చదువంటే ఇష్టం లేదు. పక్కింటి సౌదామినితో కలిసి తొక్కుడు బిళ్ల ఆడుకోవడంలో నాకెంతో ఆనందం. ఊరి చివర మామిడి తోపులోకి జొరబడి, తోటమాలి బట్టతల మీద బొప్పి కట్టేలా ఉండేలు బద్దతో గురి చూసి కొట్టి, వాడు 'కుయ్యో, మొర్రో' అని గోల పెడుతూంటే, నవ్వుకుంటూ, అందినన్ని లేత మామిడికాయలు కోసుకొచ్చి, శ్రద్ధగా ముక్కలు తరిగి, ఉప్పు, కారం అద్ది, సౌదామిని తినిపిస్తూంటే నాకు మహదానందం.

అటువంటి నన్ను తిట్టకుండా, కొట్టకుండా, అమ్మ నా చెవి మెలి పెట్టబోతే అడ్డుకుని, ఆవిడ నన్ను బెత్తంతో కొట్టబోతోంటే, తన చెయ్యి అడ్డు పెట్టి, ఆ దెబ్బ తను తిని, నన్ను గుండెలకి హత్తుకుని, లాలిస్తూ, ముద్దులాడుతూ, మంచి బుద్ధులంటే ఏమిటి, చదువుకుంటే కలిగే లాభాలేమిటి, జులాయిగా తిరుగుతే భవిష్యత్తులో కలిగే నష్టాలేమిటి అన్నది నా చిన్న మనసుకు హత్తుకునేలా బోధించిన మహానుభావుడు మా నాన్న. నేను బడికి వెళ్లనని పేచీ పెడితే, నాకు నచ్చజెప్పి, 'ఔటు బెల్లు కొట్టినప్పుడు బొంబాయి మిఠాయి కొనుక్కోరా నాన్నా' అంటూ నా చేతిలో రెండు కానులు తన చిరుగుల చొక్కాకున్న జేబులోంచి తీసి నా చేతుల్లో ఉంచేవాడు మా నాన్న.

బొంబాయి మిఠాయితో చేసిన రిష్టువాచి ఖరీదు ఒక కాని, సైకిలు ఖరీదు రెండు కానులు. నాకు బొంబాయి మిఠాయితో చేసిన సైకిలంటేనే ఇష్టం. ఒక్కొక్క చక్రం,తర్వాత హ్యాండిల్ బారు, అన్నీ నోటితో తెంపుకొని తింటూంటే, వారెవా! ఎంత ఆనందం!!

సాయంత్రం స్కూలు అయిపోయాక ఆడుకుని ఇంటికొచ్చేసరికి, మా అమ్మ నన్ను కేకలెయ్యబోతూంటే, మళ్లీ నన్ను గుండెలకి హత్తుకుని, 'ఇవ్వాళ బళ్లో ఏం చెప్పార్రా?' అంటూ నన్ను కబుర్లలోకి దింపి, నాకు గోరు ముద్దలు తినిపిస్తూ, తరువాత నన్ను చదివిస్తూ, నన్ను పడుకోబెట్టేవాడు మా నాన్న.

కానీ నాకు నిద్ర వచ్చేది కాదు. ఐనా నిద్ర నటించేవాణ్ణి. నేను పడుకొన్నాను అనుకున్నాక, మా నాన్న అమ్మ దగ్గరకి మెల్లగా వెళ్లేవాడు. ఆవిడ కాళ్లకి కొబ్బరి నూనె రాసుకుంటూంటే, 'ఉండవే అలివేలూ! నేనురాసి, నీ కాళ్లు వత్తుతాను' అంటూ అమ్మ పాదాలకి నూనె రాసేవాడు.

అమ్మ, 'ఒద్దు మావా! నువ్వు పగలంతా రిక్షా తొక్కి వచ్చావు. నేనే నీ కాళ్లు వత్తుతాను' అంటూంటే–

"కాదులే అలివేలూ! పది రూపాయల జీతం కోసం అయ్యోరింటిలో అడ్డమైన చాకిరీ చేసి, అమ్మగారి పాదాలు నొక్కడం లాంటివన్నీ చేసి, అలిసిపోయి ఇంటికొస్తావు. మళ్లీ ఇక్కడ కూడా నా కోసం, బుడ్డోడి కోసం వణ్ణం వండడం దగ్గిర్నించీ అడ్డమైన సేవలూ సేత్తావు. నీకో సీర ముక్కన్నా కొనిపెట్టలేని ఎదవని, ఐనా పేమతో నన్ను అక్కున జేర్చుకొని, నా ఒంటికి, మనసుకి సమ్మ కలిగిత్తావు. నీ ఋణం ఎట్టా తీరుద్దే అలివేలూ!" అంటూ ఆవిడ కాళ్లు వత్తుతాడు.

అది చూస్తే నాకేడుపు వచ్చేది. ఇవ్వడమే, కానీ తీసుకోవడం ఎరగని ఉదారుడాయన. 'నాన్నా! నీకోసం నేను పెద్ద చదువులు చదువుతాను. నేను కలెక్టరవుతా నాన్నా' అని ఏడుస్తూ, పుస్తకాలు ఎదర వేసుకుని చదివేవాణ్ణి.

రోజులు గడిచాయి. నెలలు గడిచాయి. సంవత్సరాలు గడిచాయి. రిక్షా తొక్కే మా నాన్న, పాచి పనులు చేసే మా అమ్మ ఆశయాలకి అనుగుణంగా నేనీ రోజు ఐఏఎస్ ఆఫీసరయ్యాను. ఎక్కడ అవినీతి జరుగుతున్నా పరశురాముడి గొడ్డలితో నరికేస్తున్నా.

'అయ్యబాబోయ్! కొండయ్యగారా! ఆయన ఐఏఎస్ ఆఫీసరు కాదురా, పరశురాముడి గొడ్డలిరా!' అని దొంగ నాయాళ్లందరూ బట్టలు తడుపుకునేలా విజృంభిస్తున్నా. 'సమాజానికి కొండయ్యలాంటి వాళ్లే కావాలి' అని పత్రికలు, మీడియా కోడై కూసేలా చెలరేగిపోతున్నా.

ఈరోజు నాకు జీతం వేలకు వేలు వస్తోంది. ఏసి భవనాలలో, ఇండికా కార్లలో నా రోజులు గడుస్తున్నాయి. నాన్న నాకు బొంబాయి మిఠాయి కొనుక్కోవడానికి ఇచ్చిన రెండేసి కానులకి బదులుగా నాన్నకి వెయ్యి రూపాయల నోట్లు, అమ్మ వెట్టి చాకిరీ చేస్తూ గడిపిన జీవితానికి ప్రతిగా ఆవిడకి పట్టు చీరలు కొనగలిగే తాహతులో బతుకుతున్నా. కానీ అమ్మకి పట్టుచీరలు కొనాలన్నా, నాన్నకి వెయ్యి రూపాయల నోట్లు ఇవ్వాలన్నా నాకిప్పుడు కుదరదు. బ్రహ్మాండమైన భవంతి కట్టు కున్నాను. పిల్లల్ని ఫారిన్‌లో చదివిస్తున్నాను.

నా చిన్నప్పుడు నా చేతుల్లో డబ్బు లేదు. కానీ అమ్మా, నాన్న ఉన్నారు. ఇప్పుడు నా చేతినిండా డబ్బే డబ్బు. కానీ అమ్మా, నాన్నా లేరు! ఎప్పుడో, ఏనాడో నేను కలెక్టరు ట్రైనింగులో ఉండగానే వాళ్లిద్దరూ కన్నుమూసారు!

★

చిరునామా
పెయ్యేటి రంగారావు,
బి-44, డికె, ఎంక్లేవ్, మియాపూర్,
హైదరాబాద్-500049
సెల్: 9490747203